గల్పిక

# దప్పిక : ఉప్పునీళ్ళు

"జ్యేష్ఠ"

కామాక్షి దీపంగా కొద్దిగా తగ్గించి ఆవులిస్తూ అంది: "నిన్నరాత్రి వెజ్జమ్మగారింట్లో దొంగలడ్డారుట." దొంగచిత్రాల పర్వతాలను చీల్చి చెండాడుతున్న సమయంలో తన ఎదుటే 'దివి నుండి భువికి' దిగినట్లు ప్రత్యక్షమైన ఇన్‌కంటాక్సు ఆఫీసర్ని చూచికూడా చలించని కాంతయ్యకు భయంతో గొంతు కెండిపోయింది. ఆ వార్త విన్నాక నోటమాట రాలేదు. సైగచేసి మంచి నీళ్ళు తెప్పించుకు తాగాడు. ఆరాత్రి కాంతయ్యకు శివరాత్రయింది.

కాంతయ్యకు కోమటి గుమాస్తాగిరీతప్ప ఏగానీ లేదు. తిండికి లోపంలేదు కాని గుడ్డకుంది. కాంతయ్య బట్టలుచూస్తే ఆదిమ నివాసుల నిరాడంబరత గుర్తోస్తుంది. కాంతయ్యకు పెళ్ళీడొస్తున్న కూతురుంది. మీనాక్షికి భర్తను కొనాలి కదూ, అందుకు కాంతయ్య చీమలా డబ్బుపోగు చేస్తున్నాడు. ఇంచుమించు రెండువేలుంది. బీడీ సొంతంగా కొనని కాంతయ్యదగ్గర రెండువేలున్నాయని ఎవరూ అనుకోలేరు—మానవాతీత శక్తులుంటే తప్ప. కాని దొంగలకి ఆశక్తి ఉందేమోనని కాంతయ్య కనుమానం. లేకపోతే ఊరుమీదపడి బతికే వెజ్జమ్మ ఇంట్లో ప్రవేశించి, తృప్తిగా నిష్క్రమించడమేమిటి? వెజ్జమ్మవద్ద బంగారంఉన్న మాట నిజమేకాని వెజ్జమ్మ ఇంట్లో ఉప్పునుంచి చీపురుదాకా ఊళ్లో వాళ్ళవే. దొంగలకు ఎట్లా తెలిసింది? (వెజ్జమ్మకు బంధువులైనా లేరే!) తన రెండూవేలూ ఏ 'తస్కర ముష్కరుడో' స్వీకరిస్తే...! అదీ కాంతయ్య బాధ.

కాంతయ్య ఇంటి భూగోళంచూస్తే కాంతయ్య భయంపై దానికి ప్రభావముందని తెలుస్తుంది. కాంతయ్య ఇంటికి ప్రహరీగోడలేదు; దడిమాత్రం ఉంది. ఇంటికి కుడివేపున ఒక సందు. సందవతల నించి దొంగబాధ లేదు. ముందునించి ఎట్లాగా తెగించలేడు. వెనకనుంచి రావటానికి మనుచరిత్రలో పాదలేపనం ఉండాలి ఆ తస్కరాధముడికి బ్రహ్మకికూడా పాదాలతో ప్రవేశమివ్వని బ్రహ్మ చెవుడు డొంకలున్నాయి. ఇక చోరాగ్రేసరుడా సందు దారిని ప్రవేశించి దడినిలంఘిస్తే చాలు!! ఆ సందు మూసేస్తేసరి. ప్రహరీగోడ ఖర్చు శతాధికంగా ఉంటుంది. కాంతయ్య ఇంటిపేరు జంబుకంవారు (ఊళ్లోవాళ్ళంటారు) అతని నోరుకూడా ఆవిషయం తెలియజేస్తుంది. మెదడుమాట సరేసరి. కాంతయ్య ఏమాలోచించాడో బ్రహ్మకి తెలియదు. కాని కాంతయ్యకి కలలొచ్చాయ్ దొంగ ఇంట్లోకి రాలేక తిరిగి పోతున్నట్లు.

ఆరోజు షాపుకి శెలవు. షావుకారు ప్రత్యేకావసరంమీద సమన్లు జారీచేశాడు కాంతయ్యకు. కాంతయ్య చొక్కా చిల్లుల్లోంచి ఒచ్చే 'పాపిష్టి కళ్ళ' ముట్టడినుంచి శరీరాన్ని రక్షిస్తూ షావుకారు గదిలో ప్రవేశించాడు. చరిత్రాత్మకమైన తన చాపనధిష్ఠించాడు. షావుకారుకు పట్నంలో మేడ ద్వారా అద్దె మూడువందలొస్తుంది. సోదర షావుకారొకడికి నాలుగువంద లొస్తోందిట. తనకీ రావాలంటాడు షావుకారు.

కాంతయ్య అన్నాడు, "పట్నంలో మేడకి మరో అంతస్తు వేయించండి." షావుకారు తృప్తి చెందలేదు. "దానికి ఏభైమాత్రమే వస్తుంది" అన్నాడు. కాంతయ్యకు తన ప్లాను ఫలించేటట్లుంది. "చిత్తం. మీ యింటి ఎడంవైపు గోడకి షెడ్లువేయించండి. సందులోకి వాలి ఉంటాయి. ప్రహరీగోడ కట్టించండి." కాంతయ్య లోలోపల ఆనందిస్తూ అన్నాడు. కాంతయ్య తన దక్షిణ హస్తంగా వ్యాపారంతో సంఘం నెత్తిమీద మొట్టుతున్నాడు షావుకారు. అట్టి షావుకారు తన సమస్యను సంఘం కోణంలోంచి చూచాడు. "మరి ఈ సందేకదా కొందరికి దారి" అన్నాడు. "నేను చూచుకుంటాలే నువ్వెళ్లు" అన్నాడు షావుకారు గరటయ్య.

అన్నట్లుగానే షావుకారు షెడ్లు వేయించి కాంతయ్య దొడ్డినానుకొని గోడకట్టించాడు. ఇక దొంగకు దారేది? కాంతయ్యకు ఆనందంతో జ్వరం వచ్చినంత పనైంది. నిజంగానే వచ్చింది జ్వరం. కాంతయ్యకు వ్యాక్యోపసంగతులు తెలియటం లేదు. కామాక్షి పెత్తనాలుచేసే మనిషికాదు. మీనాక్షి 'పాడు'పుస్తకాలు చదువుతుంది కాని 'విలేఖరి'పని చేతకాదు.

మూడోనాడు కాంతయ్య స్థానిక దినపత్రిక చూచాడు. అది షావుకారుకు బ్రహ్మరథంపట్టడం చూచాక కాంతయ్యబుర్ర తిరిగిపోయింది. ప్రజల దారిలో షెడ్లు వేయించాడని దుమ్మెత్తిపోస్తారు నలుగురూ అని భయపడ్డాడు కాంతయ్య. అంతకు ముందురోజు పేపరు తెప్పించి చూశాడు.

అందులో ఇలా ఉంది: "ఈ ఊళ్ళో ప్రజలకు రాకపోకలకు ఇబ్బంది కలిగించే బ్రహ్మచెవుడు వన మొకటి చిరకాలంనుండి వర్థిల్లుచున్నది." "షావుకారు షెడ్లగోడవే ఇబ్బందికి కారణం. ఈ సంగతి ఎత్తడే" అనుకొని మళ్ళీ చదివాడు. "దానిని గుర్తించిన శ్రీ గరటయ్య శ్రేష్ఠి బ్రహ్మచెవుడు డొంకల సమూలముగ చీల్చి చెండాడి ప్రజలకు రోడ్డు వేయించుటయేగాక క్రీడారంగము నొకటి యా స్థలమున నెలకొల్పిరి. ఆ రోడ్డుకు తారు పూయు ప్రణాలిక పంచాయితీబోర్డు వేయుచున్నది. గరటయ్య ధన్యజీవి."

రెండు ఫోటోలు కూడా వేశారు. ఒకటి ఆటస్థలానిది. దాని బ్యాక్‌గ్రౌండు కాంతయ్య పూరిల్లూ, ఆటలు మొదలెట్టిన 'బాలవానరులు' సగం పీకేసిన దడీని. కాంతయ్యకు ఏడుపొచ్చింది. ఇప్పుడు దొంగలబాధ ఇంకా పెరిగింది. ఆటస్థలం అవతలివైపు వల్లకాట్లే. సాశ్రునేత్రాలతో గరటయ్య నగుమోముచూచి, తనివితీరా తనని తిట్టుకొని పేపరు మూశాడు కాంతయ్య. మర్నాడు షావుకారు షెడ్లోకి మారాడు కాంతయ్య.

---

స్కెచ్

# విద్యా "దొంగలు"

ఆర్. సూర్యనారాయణ

స్కూలు ఫైనలు పరీక్షలకి వాచరుగా ఆ ఊరు పడిందనగానే మూర్తికి మొదట్లో భయం కలిగినమాటనిజం. ఆ సెంటరు చాలా యేండ్లనుంచీ ప్రసిద్ధి ఈ విషయంలో. అక్కడి విద్యార్థులు అన్నింటిలోనూ ఆరితేరిన వానని అక్కడకి వెళ్ళిన వాచర్లలో ఒకరో యిద్దరో తప్పకుండా తగురీతిని సత్కరించబడతారని, అందుకు అన్ని కారణాలతో బాటు ఆ హెడ్మాష్టరుకూడా కొంత కారణం అనీ, యిలాంటి కథలెన్నో విన్నాడు. అందుకోసం వెళ్ళడానికి సంశయించాడుకూడా. కాని తనతోటి బి. యిడి. ఒకాయన నిస్సందేహంగా బయలు దేరడంతో అతనూ పోవడానికే నిశ్చయించాడు.

అసలు ఈ పరీక్షల విధానమే మూర్తికి నచ్చ లేదు. ఎప్పుడో సత్యకాలంలో ప్రారంభించిన ఈ పద్ధతి యింకా అమలులోనేఉండి, వ్యతిరేక ఫలితాలనుకూడా యిస్తోందని అతని నమ్మకం. ఐనా స్థానబలిమి కలిగి, సులభోద్రేకులై, మిడి మిడి జ్ఞానంతో ఉన్న ఎదిగిన విద్యార్థులకు పరీక్షలో 'వాచ్' చేయడానికి ఎక్కడనుంచో ఒక్క ఉపాధ్యాయుణ్ణి, ఏ బలగమూ లేనివాణ్ణి, అవ్వూళ్లో సుంతైనా స్థానబలం లేనివాణ్ణివేస్తే ఏం ప్రయోజనమో అతనికి అర్థంకాలేదు. ఈ రోజుల్లో విద్యార్థులు మూడువంతులు అపసవ్యపుమార్గావలంబకులే అయ్యారు. పరీక్షల్లో తనవిధి తను ఉపాధ్యాయుడుగా, 'వాచరు'గా నిర్వహిస్తే విద్యార్థికి అది నష్టదాయకం అవుతోంది. కష్టం కలిగిన ఆ విద్యార్థి ఊరుకాని ఊళ్ళో ఈ దిక్కు లేని ఉపాధ్యాయుణ్ణి ఏంచేసినా అంతూ దరీ కనుక్కునే నాథుడే ఉండడాయిరి. విద్యార్థి జీవితానికి మార్గదర్శకుడు కాదగ్గ ఉపాధ్యాయుడే